కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో 'సర్వతోముఖాభివృద్ధి'

నగరంలోనే అత్యుత్తమ దంత వైద్యం అందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం రోగుల వ్యయ, ప్రయాసలను తగ్గిస్తోంది. ఇందులో భాగంగా కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణలో 2009 జనవరి, 24న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా వంద సీట్లతో ప్రారంభించిన ప్రభుత్వ దంత వైద్య కళాశాల నేడు రోగుల 'సర్వతోముఖాభివృద్ధి'కి తోడ్పడుతోంది. ఇక్కడ విద్య అభ్యసించే విద్యార్థులు పల్లె, పట్టణాల్లోనూ ముందడుగు వేస్తున్నారు.

- నేడు కాలేజ్ డే నిర్వహణకు సన్నద్ధం
- నేడే ప్రపంచ ఓరల్ హెల్త్‌డే కూడా..



ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆవరణంలో పూర్వపు విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన స్టేజీ

కడప అర్బన్ : ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో 2008–09 నుంచి ఇప్పటి వరకు వైద్యం అందిస్తూ ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది తమ వం కృషి చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 16 బ్యాచ్‌ల దంత వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 10 బ్యాచ్‌లు తమ విద్యను పూర్తి చేసుకున్నాయి. కళాశాలలో మొత్తం తొమ్మిది విభాగాలుండగా 2016–17 సంవత్సరాలలో నాలుగు విభాగాలకు, 2022లో నాలుగు విభాగాలకు పీజీ దంత వైద్య కోర్సులు వచ్చాయి. పీజీ విద్యను ఇప్పటి వరకు 30 మంది పూర్తిచేశారు. ఇక్కడ చదివిన డాక్టర్ హిమపవన, డాక్టర్ శిల్ప యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఇక్కడ ఓరల్ మెడిసిన్ విభాగంలో డాక్టర్ తబిత, డాక్టర్ కరణ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ అర్పిత, ఆర్థోడాంటిక్స్ నుంచి డాక్టర్ ఆనంద్, ప్రాస్తోడాంటిక్స్ నుంచి డాక్టర్ భావన, డాక్టర్ శ్రీకాంత్, ఓరల్ పెథాలజీ నుంచి డాక్టర్ ఆబిట్, పెడో డాంటిక్స్‌లో డాక్టర్ జ్యోత్స్న కన్సర్వేటివ్ విభాగం నుంచి డాక్టర్ ఆలీనా, డాక్టర్ వెంగమాంబలు జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లకు హాజరై భళా అనిపించారు.

విద్యార్థుల సేవా దృక్పథం

■ కళాశాల ఆవరణలో విద్యా దీవెన కోసం 'సరస్వతి దేవి' విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.



పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ జ్యోత్స్నను అభినందిస్తున్న అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైద్యబృందం

■ కడప నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సహకారంతో కేన్సర్ హాస్పిటల్ సముదాయం నుంచి ప్రభుత్వ దంత వైద్య కళాశాల వరకు 650 మీటర్ల మంచినీటి పైపులైనును ఏర్పాటు చేశారు.

■ పూర్వపు విద్యార్థుల సహకారంతో కళాశాల ఆవరణలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడమేగాక, అధ్యయనం కోసం అధునాతన పరికరాలను ఏర్పాటు చేశారు.

■ నిరంతర నిఘా కోసం 48 సీసీ కెమెరాలను బిగించి, ప్రిన్సిపల్ ఛాంబర్ నుంచి నేరుగా పర్యవేక్షించేలా మానిటరింగ్ సిస్టంను నెలకొల్పారు.

■ ఆన్‌లైన్ పద్ధతిలో ఓపి, ఐపీ సేవలదేలా రిజిస్ట్రేషన్‌ను అమలు చేశారు.

■ ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. కోటితో నిర్వహణ పనులను చేపట్టారు.



కడప నగర శివార్లలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాల

అందరి సహకారంతోనే అభివృద్ధి



ప్రభుత్వ అధికారులు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారుల సహకారంతోనే ప్రభుత్వ దంతవైద్య కళాశాల అభివృద్ధి సాధ్యమైంది. ప్రభుత్వ దంత వైద్య కళాశాల వైభవాన్ని గుర్తెరిగేలా బుధవారం సాయంత్రం కాలేజ్ డేను నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమానికి 2008–09 నుంచి ఇప్పటి వరకు పనిచేసిన అధ్యాపకులందరినీ ఆహ్వానించాం. ముఖ్య అతిథులుగా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం, కడప నగర పాలక సంస్థ కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌ను రానున్నారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డే ఇదేరోజు కావడం విశేషం.

– డాక్టర్ జ్యోత్స్న, ప్రిన్సిపల్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల, కడప

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో సామూహిక పూజలు చేశారు. భక్తులు ఈ సందర్భంగా ఆలయం ఎదుట దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రంజాన్ తోఫా కిట్ల పంపిణీ



పేదలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న యువకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దాతల సహాయంతో రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసినట్లు ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా పేర్కొన్నారు. నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఆరాధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 30 మందికి 12 కిలోల బియ్యం, గోధుమ పిండి, నూనె, రవ్వ, చక్కర, పసుపు, ధనియాల పొడి, మిర్చి పొడి, చింతపండు, సేమియాలు, బాదంపప్పు, కాజు, నెయ్యితో కూడిన కిట్లు అందజేశామన్నారు, ఈ కార్యక్రమంలో ఆబిద్ హుస్సేన్, హమీదా ఖానం, కరిమున్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 పరీక్షలో తెలుగు విద్యార్థులకు అన్యాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రాథమిక పరీక్షలో తెలుగు విద్యార్థులకు అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.గంగా సురేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 ప్రాథమిక పరీక్ష మార్చి 17న నిర్వహించిందన్నారు. తెలుగు, ఇంగ్లీష్ రెండు కలిపి ఏపీపీఎస్సీ కొత్తగా ప్రవేశపెట్టిన ప్రశ్నపత్రం అభ్యర్థులను ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ప్రశ్న పత్రం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లతో, విషయ నిపుణులతో తయారు చేయిస్తున్నారా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రతి ప్రశ్నలో అనువాద తప్పులు ఉన్నాయని, తెలుగు మాధ్యమ విద్యార్థులు అన్యాయానికి గురయ్యారని వాపోయారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్ పంపిణీ



హాకీ క్రీడాకారులతో ధ్యాన్‌చంద్ అకాడమీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : ధ్యాన్యచంద్ హాకీ అకాడమీ ఆధ్వర్యంలో కడప నగరంలోని హాకీ క్రీడాకారులకు సంస్థ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా, డీఎస్‌ఏ హాకీ శిక్షకుడు కల్యాణ్‌లు మంగళవారం హాకీ స్టిక్స్ పంపిణీ చేశారు. అదే విధంగా జనవరిలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన కే.డీ.సింగ్ బాబు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హాకీ సీనియర్ క్రీడాకారులు ప్రదీప్, వేణు, సుదీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువకులంతా.. రక్తదాతలే



రక్తదాన గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న ఆమూరి బాలదాస్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆరోగ్య వంతుడైన ప్రతి యువకుడు రక్తదాత కావాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిటీ మాజీ సభ్యుడు అమూరి బాలదాస్ అన్నారు. దంత వైద్యుడు డాక్టర్ ఎస్ఎండి.ఆరిఫ్‌తో కలిసి మంగళవారం రక్తదాన ప్రచార గోడ పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న కారణంగా అత్యవసరమైన సమయంలో రక్తం లభించక బాధితుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యుడు కరీముల్లా, ఎద్రిస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ బలోపేతానికి కృషి



కార్మిక పరిషత్‌లో చేరిన వారితో యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మిక పరిషత్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిషత్ రీజినల్ కార్యదర్శి పురుషోత్తం పిలుపు నిచ్చారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ రీజనల్ కౌన్సిల్ సమావేశం మంగళ వారం జరిగింది. జోనల్ చైర్మన్ పీవీ ఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కడపకు చెందిన డాక్టర్ కృష్ణ కిషోర్‌రెడ్డిని కార్మిక పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల మరణించిన మహిళా కండక్టర్ కుసుమకుమారి మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఇదే క్రమంలో వివిధ యూనియన్లకు చెందిన 15 మంది కార్మిక పరిషత్‌లో చేరారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ అధికారులు, సూపర్ వైజర్లు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో రీజినల్ చైర్మన్ యానాదిరాజు, కడప డిపో అధ్యక్షుడు ఆకుల కిషోర్ బాబు, ఉపాధ్యక్షుడుఎల్.శ్రీను, డిపో కార్యదర్శి బి.రాజేంద్రారెడ్డి, కడప డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ.అలీ, లూర్ధురాజు, ఎస్.ఖాజాపీర్, పి.నరసింహులు, నీలేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, దేవుని కడప రోడ్డు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సర్కిల్ నుంచి క్రిష్ణా సర్కిల్ వరకూ డివైడర్లు నిర్మించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ కాలువలపై స్లాబ్ వేయాలని, . పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద ఆక్రమణలను తొలగించాలన్నారు. మున్సిపల్ ఉర్దూ పాఠశాల వద్ద జరుగుతున్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, నగరపాలక ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

పది పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరు

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పది పరీక్షల్లో హిందీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 356 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 352 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 239 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 235 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా 117 మంది హాజరయ్యారు.

కాగా మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సంభందించి ఏపీ మోడల్ స్కూల్‌లో 156 మంది విద్యార్థులకు 150 మంది హాజరయ్యారు. ఆరు మంది గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 125 మంది విద్యార్థులకు 118 మంది హాజరయ్యారు. 7 మంది గైర్హాజరయ్యారు. పదవ తరగతి పరీక్షలను స్క్వాడ్ జాఫర్ సాధిక్ తనిఖీ చేశారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి ఎద్దడిపై దృష్టి సారించాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందస్తుగా తాగునీటి సమస్యలు ఏర్పడే గ్రామాలను గుర్తించాలన్నారు. ఎక్కడైన మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో ఎక్కువగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈకి సర్పంచ్‌లు విన్నవించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏఓ అల్తాఫ్ హుస్సేన్, పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి

కమలాపురం : ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ కేటాయింపుల్లోని నిధులను, సెంటర్ల రెన్యువేషన్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసిన వస్తువులను బహిరంగ వేలం లేదా టెండర్ పిలవకుండా ఏకపక్షంగా ఎలా కొనుగోలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఐసీడీఎస్ అధికారులు చేతివాటం ప్రదర్శించి కమీషన్ల కోసం కక్కుర్తి పడి వస్తువులు కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని 13 ప్రాజెక్ట్‌ల్లో 1030 సొంత భవనాలు ఉన్నాయన్నారు. ప్రతి సెంటర్ నిర్వహణకు ఏటా రూ.3వేలు మంజూరు చేస్తారని, అయితే గత ఏడాది నిధులు మంజూరు చేయక పోవడంతో ఈ ఏడాది రూ.6 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ నగదును వర్కర్ల ఖాతాలో జమ చేశారన్నారు. అయితే అందులో రూ.3 వేలు వెనక్కు ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులు వర్కర్లకు హుకుం జారీ చేయడం వెనుక పరామర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఐసీడీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో వలంటీర్లు



ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఉత్సాహంగా సాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటు ప్రాధాన్యతపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. పలు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలోఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ గంగయ్య ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం ఎల్లటూరులో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన భారతదేశ పౌరులంతా ఓటు హక్కు ఉపయోగించడం బాధ్యతగా భావించాలన్నారు. ఎన్ని పనులున్నా పోలింగురోజున ఓటు కేంద్రానికి వెళ్లాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలను అవగాహన కల్పించారు. యూనిట్–4 వాలంటీర్లు మిట్టమీద పల్లెలో మానసిక ఒత్తిడి అంశంపై అవగాహన కల్పించారు. వైవీయూ సైకాలజీ విభాగం సహ ఆచార్యులు డా. కె.లలిత మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన జీవితం ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించారు. యూనిట్–5 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. అనిత ఆధ్వర్యంలో కొప్పర్తిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వారం రోజులపాటు వాలంటీర్లు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. కడప నగరంలోని పక్కీరుపల్లెలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్థిక, సామాజిక సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఓటే ఆయుధం

కడప కార్పొరేషన్ : సార్వత్రిక ఎన్నికల్లో మహిళలంతా ఓటు ఆయుధంగా వినియోగించుకుని నిజాయతీ గల నాయకుడిని ఎన్నుకోవాలని ఓటరు అవగాహన నోడల్ అధికారి టి.హరిప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లో ఓటరు చైతన్య కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ పోలింగ్ బూత్ వివరాలను హెల్ప్‌లైన్ నంబర్ 1950కి ఫోన్ చేసి తెలుసుకోవాలని వివరించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే సి.విజిల్ యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ట్యాలీ ప్రైమ్‌తో ఉపాధి అవకాశాలు

కమలాపురం : ట్యాలీ ప్రైమ్‌తో ఉపాధి అవకాశాలు సులువుగా సాధించవచ్చని ఏపీ, టీజీ ట్యాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ టి.మల్లేశ్వరగుప్తా తెలిపారు. మంగళవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ట్యాలీ ప్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ తరుణంలో ఏ చిన్న అవకాశం వచ్చినా వదలకూడదన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాలీ ప్రైమ్ నిరుద్యోగులకు ఒక వరం లా మారి ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిస్తోందన్నారు.

పరీక్షా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపియింగ్ జరుగుతున్న పరీక్ష కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ జమ్మలమడుగు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలాపురం నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను 27,858 మంది రాస్తున్నారని తెలిపారు. మాస్ కాపియింగ్ కోసం ఒక్కో విద్యార్థి నుంచి ఓపెన్ స్కూల్ నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మాస్ కాపియింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలని ఈనెల 14న డీఈఓ అనురాధకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఓపెన్ స్కూల్ నిర్వాహకుడు లక్ష్మిరెడ్డి తమను బెదిరించారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ కట్టడాల తొలగింపు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ గ్రామ పరిధి బొగ్గిడివారిపల్లి పంచాయతీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ రేణుక మాట్లాడుతూ బొగ్గిడివారిపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్ 870లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దారు మురాషావలి ఆదేశాల మేరకు తొలగించామన్నారు. కొంతమంది స్థానికేతరులు స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు అక్కడికి వెళ్లి అక్రమ కట్టడాలను కూలివేశారు. అనంతరం ప్రభుత్వ స్థలంలో వీఆర్‌ఓ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

ఆస్పత్రిని సందర్శించిన చిన్నజీయర్‌స్వామి

బద్వేలు అర్బన్: పట్టణంలో గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ కుమారుడు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నూతనంగా 'బంగారు శీనయ్య' ఆస్పత్రిని నిర్మించారు. బుధవారం ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆస్పత్రిని ప్రముఖ వేద గురువు శ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి సందర్శించారు. ఆస్పత్రి దినదినాభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆశీర్వదించారు. తొలుత ఆస్పత్రి నిర్వాహకులు స్వామిని సత్కరించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆస్పత్రిలో చిన్నజీయర్‌స్వామి

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ నజీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలి వున్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, బడి మాని వేసినవారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ కుటుంబాలకు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హులైన బాలికలు ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వల్లూరు కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 40 సీట్లు అందుబాటులో వున్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

సువిధ యాప్‌లో నమోదు చేసుకోండి

పులివెందుల టౌన్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, మీటింగులు, మైక్‌సెట్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే సువిధ యాప్‌లో నమోదు చేసుకోవాలని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలు, సమావేశాలు, బ్యానర్లు ఏవైనా కట్టుకోవాలన్నా సువిధ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ మద్దిలేటిలు మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రూపుల అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు.